# సాక్షి వికారాబాద్

సోమవారం । 21 । ఏప్రిల్ । 2025







## ప్రయాణం.. నరకప్రాయం !

దోమ మండలంలోని గ్రామీణ ప్రాంత రోడ్లు అధ్వానంగా మారాయి. కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. 8లో▸



## దళారులను నమ్మి..

దళారులను నమ్మి మోసపోవద్దని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి రైతులకు సూచించారు. 9లో▸



## ఐదేళ్లుగా అసంపూర్తిగానే..!

కుల్కచర్ల మండల కేంద్రంలో సీడీపీ నిధులతో చేపట్టిన గ్రామ సంఘం భవనం నిధుల కొరత కారణంగా ఆగిపోయింది. 9లో▸

## న్యూస్‌రీల్

### నేడు దరఖాస్తుల స్వీకరణ

తాండూరు రూరల్: మండలంలోని మల్కాపూర్ శివారులో గల అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో ఉద్యోగాల కోసం అర్హులైన వారి నుంచి సోమవారం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కంపెనీ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని రోజుల నుంచి సిమెంట్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కోరుతున్నారు. ఈ క్రమంలో నిరుద్యోగులన నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు కంపెనీ ప్రతినిధులు సిద్ధమయ్యారు. చదువుతోపాటు వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసిన వారికి అవకాశం కల్పించనున్నారు.

### కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దుద్యాల్: అభివృద్ధిలో దుద్యాల్ మండలం రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ అన్నారు. ఆదివారం దుద్యాల్ మండలం హస్నాబాద్ శివారులోని రంకుల మసీదు నుంచి దుద్యాల్ వరకు రూ.4.98 కోట్లతో చేపట్టనున్న 3.6 కిలో మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేస్తోందన్నారు. మండలం అన్ని విధాలా అభివృద్ధి చెందితేనే ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. త్వరలో పరిశ్రమలు కూడా వస్తాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటయ్య, సెక్రటరీ మల్లేశ్, నాయకులు ఖాజా, శ్రీశైలం గౌడ్, సత్యనారాయణ, ముజీఫ్, ఖలీల్ పాషా, భీములు, మైమూద్, వెంకటయ్య, కృష్ణ, నర్సింలు, బాలు, సురేశ్, ఆంజనేయులు, రాజు, ముద్దప్ప తదితరులు పాల్గొన్నారు.

### పార్కును సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



పార్కును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు

పరిగి: పట్టణ పరిధిలోని అర్బన్ పార్కును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జాఫర్‌పల్లిలో రూ.4 కోట్లతో ఏర్పాటు చేస్తున్న పార్క్‌ను నేతలతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యానికి పార్కులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

### దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

కొడంగల్: జాతీయ కార్మిక సంఘాలు మే 20న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య కోరారు. కొడంగల్ డివిజన్ స్థాయిలో ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక చట్టాలను రద్దు చేయాలన్నారు. సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం సీఐటీయూ కొడంగల్ మున్సిపల్ స్థాయి నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా పకీరప్ప, ఉపాధ్యక్షుడిగా మొగులప్ప, కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా విజయ్‌కుమార్, సభ్యులుగా వెంకటప్ప, కిష్టప్ప, మొగులయ్యను ఎన్నుకున్నారు.

# అవినీతి మరకలు చిరుద్యోగులకే..

**ఆరోపణలు వచ్చినా అధికారులు మాత్రం సేఫ్**

- అటవీ శాఖ అవకతవకల్లో కంప్యూటర్ ఆపరేటర్లపై వేటు
- డీఆర్డీఏ అక్రమాల్లో కింది స్థాయి ఉద్యోగికి ఉద్వాసన
- పంచాయతీరాజ్, రెవెన్యూ, పోలీస్ శాఖల్లోనూ ఇదే తంతు



వికారాబాద్: ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, అక్రమాలు వెలుగు చూసిన ప్రతిసారీ చిరుద్యోగులే బలవుతున్నారు. అధికారుల పాత్ర ఉన్నా వారు మాత్రం సేఫ్‌గా ఉంటున్నారు. అసలు విషయం జిల్లా ఉన్నతాధికారులకు తెలిసినా విచారణ పేరుతో కాలయాపన చేసి చేతులు దులుపుకొంటున్నారు.. ఇటీవల కాలంలో జిల్లాలోని ఏదో ఒక శాఖలో అవినీతి భాగోతం వెలుగు చూస్తూనే ఉన్నాయి. అధికారుల ప్రమేయం లేకుండా అక్రమాలు జరిగే అవకాశం లేదనేది అందరికీ తెలిసిన విషయమే.. కానీ నేరం కిందిస్థాయి సిబ్బందిపై మోపి అధికారులు తప్పించుకుంటున్నారు.

### మెజార్టీ శాఖలకు అవినీతి కంపు

జిల్లాలోని దాదాపు అన్ని శాఖల్లో అవినీతి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. రెవెన్యూ, అటవీ, డీఆర్‌డీఏ, పంచాయతీరాజ్, పోలీస్ శాఖల్లో అవకతవకలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇటీవల ఈ శాఖల్లో అనేక అక్రమాలు వెలుగు చూశాయి. కొన్ని చోట్ల అధికారులు, కిందిస్థాయి సిబ్బంది ఏసీబీ అధికారులకు చిక్కారు. కానీ చేతివాటం ప్రదర్శించిన అధికారులు మాత్రం మరక అంటకుండా చూసుకుంటున్నారు. కిందిస్థాయి ఉద్యోగులపై తప్పులు నెట్టేసి వారికి శిక్ష పడేలా చూస్తున్నారు.

### అటవీ శాఖలో..

ఇటీవల కాలంలో అటవీ శాఖలో అవినీతి ఘటనలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. గత ఏడాది తునికాకు సేకరించిన కూలీలకు అందాల్సిన బోనస్ డబ్బులను ఫారెస్టు అధికారులు కాజేశారు. దాదాపు రూ.10 లక్షలకు పైగా సొంత, బంధువుల ఖాతాల్లో జమ చేసి స్వాహా చేశారు. ఇందులో వికారాబాద్, ధారూరు రేంజ్ అధికారుల ప్రమేయం ఉందని అధికారులు తేల్చారు. జిల్లా అధికారిపై కూడా ఆరోపణలు వచ్చాయి. చివరకు ఇద్దరు రేంజ్ ఆఫీసర్లను బదిలీ చేసిన ఉన్నతాధికారులు ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేసే ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లకు ఉద్వాసన పలికి చేతులు దులుపుకొన్నారు. ఈ ఘటన మరువక ముందే తాండూరు సమీపంలో అటవీ పార్కులో అక్రమాలు వెలుగు చూశాయి. కూలీలతో చేయించాల్సిన పనులను అధికారులే కాంట్రాక్టర్లుగా మారి లక్షల్లో కాజేశారు. ప్రస్తుతం దీనిపై రాష్ట్రస్థాయి అధికారుల ఆధ్వర్యంలో విచారణ జరుగుతోంది. ఇందులో ఎవరిని బలి చేస్తారో చూడాల్సి ఉంది.

### డీఆర్డీఏలో..

డీఆర్డీఏలో మహిళా సంఘాల సభ్యులకు సంబంధించిన రూ. 10లక్షలను ఆ శాఖ ఉద్యోగులు కాజేశారు. సంఘం ఖాతాలో జమ చేయాల్సిన డబ్బును సొంత, బంధువుల ఖాతాలో జమ చేసుకొని స్వాహా చేశారు. బొంరాస్‌పేట మండలంలో ఈ అవినీతి భాగోతం జరిగింది. విచారణ జరిపిన ఉన్నతాధికారులు ఇందులో డీపీఎం, వీబీకేల ప్రమేయం ఉన్నట్లు తేల్చారు. వీబీకేను విధుల నుంచి తొలగించి డీపీఎంను సస్పెండ్ చేశారు. కొద్ది రోజులకే ఆ డీపీఎంను మళ్లీ విధుల్లోకి తీసుకోగా చిరుద్యోగికి మాత్రం ఉద్వాసన పలికారు. ఈ ఉదంతంలో జిల్లా అధికారిపైన కూడా ఆరోపణలు రాగా చూసీచూడనట్లు వ్యవహరించారు.

### రెవెన్యూ శాఖలో..

ఇటీవల పూడూరు మండలంలో ఒకరి పేరిట రిజిస్ట్రేషన్ చేయాల్సిన భూమిని మరొకరి పేరిట చేశారు. ఇందులో భారీగా డబ్బులు చేతులు మారినట్టు ఆరోపణలు వచ్చాయి. ఇలాంటి ఘటనే మోమిన్‌పేట మండలంలో కూడా చోటుచేసుకుంది. బాధితుల ఫిర్యాదుతో అసలు విషయం బయటపడింది. పూడూరు డిప్యూటీ తహసీల్దార్, ఆర్‌ఐలను బాధ్యులను చేస్తూ వారిని బదిలీ చేశారు. వీరు రైతుల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేసినట్లు ఆడియో రికార్డులు వెలుగు చూశాయి. ఈ ఘటనకు బాధ్యులను చేస్తూ ఐదు మండలాల కంప్యూటర్ ఆపరేటర్లను ఒకచోటు నుంచి మరోచోటికి బదిలీ చేసి చేతులు దులుపుకొన్నారు. ఈ రెండు మండలాల్లో తహసీల్దార్ల పైనకూడా ఆరోపణలు వచ్చినా ఎలాంటి విచారణ చేపట్టలేదు.

### పంచాయతీరాజ్ శాఖలో..

పెద్దేముల్ జీపీ కార్యదర్శి పంచాయతీ బిల్లుల విషయంలో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. విచారణ జరిపిన ఉన్నతాధికారులు అవినీతి నిజమేనని తేల్చారు. పత్రికల్లో వార్తలు కూడా వచ్చాయి. పంచాయతీ కార్యదర్శిని కుల్కచర్ల మండలానికి బదిలీ చేశారు. ఆ వెంటనే ఎంపీఈఓ బాధ్యతలు అప్పగించి విధుల్లోకి తీసుకున్నారు.

### పోలీస్ శాఖలో..

ఓ భూ వివాదంలో తలదూర్చి రైతులను బెదిరించినట్లు చన్గోముల్ ఎస్ఐతో పాటు కానిస్టేబుళ్లపైన ఆరోపణలు వచ్చాయి. ఇందుకు సంబంధించిన వీడియోలు కూడా వైరల్ అయ్యాయి. విచారణ చేపట్టిన అధికారులు ఒక కానిస్టేబుల్, ఒక హోంగార్డును బదిలీ చేసి చేతులు దులుపుకొన్నారు. ఎస్ఐపై ఆరోపణలు వచ్చినా చూసీచూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. తాండూరు నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాలో పోలీసుల పాత్ర ఉందని తేలింది. అయితే బదిలీలతో సరిపెట్టారు. అలాగే పరిగి, దుద్యాల్ తహసీల్దార్లు, తాండూరులో రెవెన్యు అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కొందరు అధికారులు ఏసీబీకి కూడా చిక్కిన ఘటనలు ఉన్నాయి. జిల్లాలో తరచూ అధికారుల అవినీతి భాగోతం బయటపడుతుండటం ఆందోళన కలిగిస్తోంది.



మోమిన్‌పేట: అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

# అంబేడ్కర్ ఆశయాలు సాధిద్దాం

**స్పీకర్ గడ్డం ప్రసాదకుమార్**

మోమిన్‌పేట: ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ చూపిన బాటలో నడిచి ఆయన ఆశయాలను సాధిద్దామని స్పీకర్ గడ్డం ప్రసాదకుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని సయ్యద్‌అల్లిపూర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించి మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. కాంగ్రెస్‌తోనే బడుగు, బలహీల వర్గాలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. అంబేడ్కర్ కలలను కేవలం కాంగ్రెస్ మాత్రమే సాకారం చేస్తుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న రిజర్వేషన్లను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సయ్యద్ అల్లిపూర్ నుంచి కొటమర్పల్లి మట్టి రోడ్డును బీటీగా మారుస్తామని తెలిపారు. కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, నాయకులు సుభాష్ గౌడ్, సురేందర్, సుభాష్, మాణయ్య, చంద్రయ్య, మహంత్‌స్వామి, ఎజాస్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పంచలింగాల గ్రామంలో..**

మర్పల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశ ప్రజల జీవన రేఖ అని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మండలంలోని పంచలింగాల గ్రామంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం గ్రామంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని రచించిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. ఆయన ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాములు యాదవ్, సుభాష్ యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు సురేష్, బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, మర్పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల స్ఫూర్తితో ఉద్యమబాట

**ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి**

ఇబ్రహీంపట్నం: మహిళలు, దళిత, గిరిజన హక్కులను మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, జాతీయ నాయకురాలు జ్యోతి అన్నారు. ఈనెల 14న ప్రారంభమైన 'పూలే, అంబేడ్కర్ యాదిలో మహిళ హక్కుల పరిరక్షణ యాత్ర' రాష్ట్రంలో 18 జిల్లాల్లో కొనసాగింది. ఇబ్రహీంపట్నంలో ఆదివారం ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళా హక్కుల పరిరక్షణకు కృషిచేసిన మహనీయులైన జ్యోతిరావుపూలే, సావిత్రిబాయిపూలే, అంబేడ్కర్ స్ఫూర్తితో భవిష్యత్తు ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అనేక మంది వీరమణులు పోరాడి సాధించుకున్న మహిళా హక్కులు నేడు ప్రమాదంలో పడ్డాయన్నారు.



రథోత్సవంలో ఎమ్మెల్యే, మండలి చీఫ్ విప్, ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు

# నేతల ఆధిపత్యపోరు

- రథోత్సవంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మధ్య తోపులాట

తాండూరు: పట్టణంలో కొలువుదీరిన భావిగి భద్రేశ్వర స్వామి రథోత్సవ వేడుకల్లో రాజకీయ పార్టీల నాయకుల మధ్య ఆధిపత్యపోరు కనిపించింది. నాలుగేళ్లుగా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఆధిపత్య పోరు సాగుతూ వస్తోంది. శనివారం అర్ధరాత్రి జరిగిన వేడుకల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మధ్య తోపులాట జరిగింది. రథోత్సవంలో మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. వారి వెంట అనుచరగణం పెద్ద ఎత్తున తరలివచ్చారు. పూర్ణకుంభం పూజ నిర్వహించే సమయంలో నాయకుల మధ్య తోపులాట జరిగింది. బీజేపీ నాయకులకు బీఆర్ఎస్ నాయకుల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. రథోత్సవంలో నేతలు కూర్చోవడానికి స్థలం కోసం పోటీ పడ్డారు. తోపులాట జరుగుతున్న విషయం తెలుసుకున్న ఎంపీ కొండా, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి రథం కదలక ముందే అక్కడి నుంచి వెళ్లిపోయారు. పోలీసు అధికారుల అప్రమత్తతతో ఎలాంటి గొడవలు జరగకుండా రథోత్సవం ప్రశాంతంగా ముగిసింది.

# త్వరలో అంతర్రాష్ట్ర బస్సు సర్వీసులు



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

**ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి**

తాండూరు: తాను ఎమ్మెల్యే అయిన 15 నెలల వ్యవధిలో తాండూరు ఆర్టీసీ డిపోకు 34 కొత్త బస్సులు తెచ్చానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, నాయకులతో కలిసి తాండూరు ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. కర్ణాటక రాష్ట్రంలోని బీదర్, యాద్గిర్ ప్రాంతాలకు తాండూరు నుంచి బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నందున ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే.. డీఎం సురేష్‌కుమార్‌కు సూచించారు. ఇందుకు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు కావాలని డీఎం తెలపడంతో ఎమ్మెల్యే మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఫోన్ చేసి తాండూరు నుంచి అంతర్రాష్ట్ర బస్సు సర్వీసులు నడిపేలా చొరవ చూపాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలో అంతర్రాష్ట్ర బస్సు సర్వీసులు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే తెలిపారు.

# పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్**



అనంతగిరి: మాట్లాడుతున్న మహిపాల్



తాండూరు రూరల్: బెల్కటూర్‌లో వరి పంటను పరిశీలిస్తున్న ఏఈఓ శ్రీనివాస్

అనంతగిరి: అకాల వర్షాలు, ఈదురు గాలులకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం వికారాబాద్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15 రోజులుగా కురుస్తున్న వర్షాలు, గాలులకు మామిడి కాయలు నేల రాలయన్నారు. ఇతర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. పాత ఇండ్లు కూలిపోయాయని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వేసి రైతులకు పరిహారం అందేలా చూడాలని ఆయన కోరారు. అలాగే వరి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్, నవీన్, అక్బర్, యాదయ్య, నర్సింలు, సత్తయ్య, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

**దెబ్బతిన్న పంటల పరిశీలన**

తాండూరు రూరల్: మండలంలోని బెల్కటూర్‌లో అకాల వర్షాలకు దెబ్బతిన్న వరి పంటను వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. ఏఈఓ శ్రీనివాస్ ఆదివారం బాధిత రైతులతో మాట్లాడారు. వడగళ్ల వానకు చేతికొచ్చిన వరి పంట నెలకొరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని పలువురు కోరారు. దెబ్బతిన్న పంటల వివరాలు ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని ఏఈఓ తెలిపారు.

# మృత్యుపాశాలు

- ప్రాణాలు తీస్తున్న విద్యుత్ తీగలు
- గత సంవత్సరం 69 మంది మృత్యువాత
- తాజాగా కొందుర్గు, శంషాబాద్‌లో విద్యుత్‌షాక్‌తో ఇద్దరి మృతి



భారీ ఈదురు గాలులతో కూడిన వర్షానికి ఇటీవల కొందుర్గు మండలం చిన్న ఎల్కిచర్ల శివారులోని ఓ వ్యవసాయ పొలంలో విద్యుత్ స్తంభం నేలకూలి, వైర్లు తెగిపడ్డాయి. పర్వతాపూర్‌కు చెందిన అశోక్‌రెడ్డి (35) అటు వైపు వెళ్లగా ప్రమాదవశాత్తు తెగిపడిన వైరు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. సాధారణంగా వైర్లు తెగిపడిన వెంటనే ఫీడర్ ట్రిప్పై సరఫరా నిలిచిపోతోంది. కానీ ఇక్కడ అలా జరగకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

శంషాబాద్ మండలం పెద్దషాపూర్ రైల్వేట్రాక్ సమీపంలోని ఓ తోటలో ఇబ్రహీంపట్నానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కె.చేతన్‌రెడ్డి(26) మామిడికాయలు కోసేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందాడు.

సాక్షి, రంగారెడ్డిజిల్లా: వెలుగులు పంచాల్సిన విద్యుత్ తీగలు.. ప్రాణాలు తోడేస్తున్నాయి.. కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగుల్చుతున్నాయి.. సాంకేతికంగా అభివృద్ధి చెందిన ప్రస్తుత తరుణంలో ప్రమాదాల సంఖ్య తగ్గకపోగా మరింత పెరుగుతుండడం ఆందోళన కలిగించే పరిణామం. విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాతపడుతున్న వారిలో అధికంగా సంస్థతో సంబంధం లేని ప్రైవేటు కార్మికులు, సాధారణ ప్రజలే ఉంటుండటం విశేషం. గ్రేటర్ పరిధిలో గత సంవత్సరం ఏకంగా 69 మంది విద్యుతాఘాతలతో మృత్యువాత పడటం పరిస్థితికి అద్దం పడుతోంది. ఏప్రిల్ నుంచి అక్టోబర్ నెలల్లోనే అత్యధిక ప్రమాదాలు వెలుగు చూస్తుండటం గమనార్హం. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో అనేక చోట్ల ఇళ్లపైనే వైర్లు వేలాడుతున్నాయి. భారీ ఈదురు గాలులతో కూడిన వర్షాలకు తెగిపడుతున్నాయి. తరచూ చెట్ల కొమ్మలు విరిగి లైన్లపై పడుతున్నాయి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలుతున్నాయి. వాటి చుట్టూ సరైన కంచె సహా ఎర్తింగ్ సిస్టం సరిగా లేకపోవడంతో సాధారణ పౌరులతో పాటు మూగజీవాలు మృత్యువాతపడుతున్నాయి.

**బయటివారితో విద్యుత్ పనులు**

మెజార్టీ సెక్షన్ల పరిధిలో అనుభవం, అర్హత ఉన్న జూనియర్ లైన్‌మెన్‌లకు బదులు ఎలాంటి అనుభవం, అర్హత లేని ప్రైవేటు కార్మికులతో పని చేయిస్తున్నారు. విద్యుత్ లైన్లపై వీరికి సరైన అవగాహన కూడా ఉండటం లేదు. లైన్ల పునరుద్ధరణ, ఇతర మరమ్మతుల సమయంలో ఎల్సీ తీసుకున్నప్పటికీ.. గృహాలు, వాణిజ్య సముదాయాలు, పరిశ్రమల్లోని ఇన్వర్టర్లు/ జనరేటర్లు ఆన్‌లో ఉండటం వాటి నుంచి రివర్స్‌లో కరెంట్ సరఫరా కావడం తెలిసిందే. ఈ విషయం తెలియక కార్మికులు వాటిని ముట్టుకుని ప్రమాదాల బారిన పడుతున్నారు. వాస్తవానికి స్తంభాలు ఎక్కే ముందే టంగ్ టెస్టర్‌తో ఎర్తింగ్ చెక్ చేయాల్సి ఉంది. కానీ కనీస భద్రతా చర్యలు తీసుకోకుండా ఏకంగా స్తంభాలు ఎక్కి సర్వీసు వైర్లు కలుపుతున్నారు. ఇప్పటి వరకు నమోదైన మృతుల్లో జేఎల్ఎంలు, ఆర్టిజన్లతో పాటు ప్రైవేటు కార్మికులే ఎక్కువగా ఉన్నట్లు డిస్కం గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. తీరా ప్రమాదాల్లో చనిపోయిన తర్వాత సంస్థ నుంచి వారికి ఎలాంటి బెనిఫిట్స్ కూడా అందడం లేదు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించి, ప్రైవేటు కార్మికుల మరణాలకు కారణమైన క్షేత్రస్థాయి అధికారులపై ఇప్పటి వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు కూడా లేవు.

**గ్రేటర్‌లో విద్యుత్‌షాక్ మరణాలు**

| సర్కిల్ | మృతులు |
|---|---|
| మేడ్చల్ | 15 |
| రాజేంద్రనగర్ | 13 |
| సైబర్‌సిటీ | 12 |
| సరూర్‌నగర్ | 12 |
| బంజారాహిల్స్ | 04 |
| హబ్సీగూడ | 04 |
| హైదరాబాద్ సెంట్రల్ | 04 |
| హైదరాబాద్ సౌత్ | 03 |
| సికింద్రాబాద్ | 02 |

## క్లుప్తంగా

### పిడుగుపడి ఆవు మృతి



మృతి చెందిన పాడి ఆవువద్ద రైతు కుటుంబం

**కేశంపేట:** మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో పిడుగుపడి పాడి ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు బడక సత్యనారాయణ తన పాడి ఆవును ఎప్పటిలాగే చెట్టుకింద కట్టేశాడు. ఆదివారం ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడ్డాయి. పిడుగుదాటికి చెట్టు కింద ఉన్న పాడిఆవు మృతి చెందింది. పాడిపైనే ఆధారపడి జీవిస్తున్న సత్యనారాయణను ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

### అద్దె పేరుతో యూపీఐ మోసం

**బంజారాహిల్స్:** అద్దె పేరుతో యూపీఐ మోసానికి పాల్పడిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సికింద్రాబాద్ ఓల్డ్ సఫిల్‌గూడకు చెందిన వెంకటేషన్ బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-14 నవోదయకాలనీలోని ఓ కంపెనీలో హెచ్ఆర్ విభాగంలో పని చేస్తున్నాడు. వెంకటేషన్ నాగ్‌పూర్‌లో డబుల్‌బెడ్‌రూమ్ ఫ్లాట్ కొనుగోలు చేశాడు. దీనిని అద్దెకు ఇవ్వాలనే ఉద్దేశంతో మ్యాజిక్ బ్రిక్స్.కామ్‌లో నమోదు చేసుకున్నాడు. దీనిని చూసిన ఆశిష్ కుమార్ పరహరి అనే వ్యక్తి సదరు 2బీహెచ్‌కే ఫ్లాట్‌ను అద్దెకు తీసుకుంటానని చెప్పాడు. తాను భారత సైన్యానికి చెందినవాడినని, తాను నాగ్‌పూర్‌కు బదిలీ అయినందున అక్కడకు మకాం మార్చాలనుకుంటున్నానని చెప్పాడు. ఆశిష్‌కుమార్ తన ఆధార్‌కార్డుతో పాటు భారత సైన్యం ఐడీ కార్డు వంటి వివరాలను కూడా పంపించాడు. ఇండియన్ ఆర్మీ నుంచి రాజేంద్రసింగ్ షెకావత్ మీ అకౌంట్‌కు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయడానికి ఫోన్ చేస్తారని కూడా చెప్పాడు. అయితే ముందుగా ఒక రూపాయిని తనకు యూపీఐ ద్వారా పంపించాలని కోరాడు. ఆ తర్వాత అతని అకౌంట్ ద్వారా రూ.5 ట్రాన్స్‌ఫర్ చేశాడు. ముందుగా మాట్లాడుకున్న దాని ప్రకారం మూడు నెలలు అద్దె రూ.51వేలు ఆశిష్ కుమార్ చెల్లించాల్సి ఉంది. కానీ సైబర్ టోకరా కారణంగా వెంకటేషన్ ఖాతా నుంచే రూ.51 వేలు బదిలీ కాగా, ఆశిష్‌కుమార్ అకౌంట్ నుంచి తిరిగి రాలేదు. దీంతో తాను మోసపోయాయని గ్రహించి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### చిలుకూరు ఫారెస్ట్ ట్రెక్ పార్కులో నేచర్ క్యాంప్

**మొయినాబాద్:** మున్సిపల్ పరిధిలోని చిలుకూరు ఫారెస్ట్ ట్రెక్ పార్కులో నేచర్ క్యాంప్ నిర్వహించారు. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డెక్కన్ వుడ్స్ అండ్ ట్రయల్స్ పేరిట శనివారం సాయంత్రం 4 గంటల నుంచి ఆదివారం ఉదయం 10 గంటల వరకు చేపట్టిన నేచర్ క్యాంపులో మైక్రాన్ సంస్థ ఐటీ ఉద్యోగులు 52 మంది పాల్గొన్నారు. అడవిలో టెంట్ ఎలా వేయాలి, క్యాంప్ ఫైర్, ట్రెక్కింగ్, నేచర్ ట్రయల్, టెంట్‌లో విడిది, పక్షుల వీక్షణ, చెట్ల గురించి, సహజ రాతి నిర్మాణాల గురించి వారికి నేచురలిస్టులు అఖిల్, అపరంజిని, సుమన్ వివరించారు. చెట్లు, వాటి ఉపయోగాల గురించి తెలియజేశారు. ఐటీ ఉద్యోగులు నేచర్ క్యాంపులో ఆసక్తికరంగా పాల్గొన్నారు.

### క్రికెట్ ఆడుతూ కుప్పకూలాడు

గుండెపోటుతో యువకుడి మృతి

**కీసర:** మైదానంలో క్రికెట్ ఆడుతూ ఓ యువకుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన ఆదివారం రాంపల్లిదాయరలో చోటుచేసుకుంది. కీసర సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన ఎం.ప్రణీత్ (32) కెనరా బ్యాంకులో పని చేస్తున్నాడు. ఆదివారం సెలవు రోజు కావడంతో స్నేహితులతో కలిసి రాంపల్లిదాయర సమీపంలోని మైదానంలో క్రికెట్ ఆడుతుండగా అకస్మాత్తుగా కిందపడిపోయాడు. వెంటనే స్నేహితులు సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా.. ప్రణీత్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడటానికి వచ్చి గుండెపోటుతో మృతి చెందడంతో ప్రణీత్ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కీసర పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### వృద్ధుడి అదృశ్యం

**గౌలిపురా:** వృద్ధుడు అదృశ్యమైన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మహారాష్ట్రకు చెందిన రాజు పన్నాలాల్ టక్ (70) దంపతులు ఈ నెల 14న సుల్తాన్‌షాహీ వాల్మీకినగర్‌లో నివాసముండే మనువడు ఆకాశ్ టక్ కూతురు జన్మదిన వేడుకల కోసం వచ్చారు. కాగా ఈ నెల 19న పన్నాలాల్ టక్ ఇంట్లో కుటుంబసభ్యులకు చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన మనువడు ఆకాశ్ స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఫలితం లేకుండా పోయింది. దీంతో తన తాత కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రయాణం.. నరకప్రాయం!

### కంకర తేలిన పాలేపల్లి - ఐనాపూర్ బీటీ రోడ్డు

- ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని వైనం
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



కంకర తేలిన పాలేపల్లి - ఐనాపూర్ బీటీ రోడ్డు

**దోమ:** మండలంలోని గ్రామీణ ప్రాంత రోడ్లు అధ్వానంగా మారాయి. కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రయాణం నరకాన్ని తలపిస్తోందని వాహనదారులు అంటున్నారు. పాలేపల్లి - ఐనాపూర్ రోడ్డు గుంతలమయంగా మారడంతో మల్లేపల్లి, దాదాపూర్, కొత్తపల్లి, గుండాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. చీకటైతే ప్రయాణం కష్టంగా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రామీణ రోడ్లపై దృష్టి సారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

#### తరచూ ప్రమాదాలు



పాలేపల్లి – ఐనాపూర్ రోడ్డ కంకర తేలి ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళ దిచక్ర వాహనాల్లో ప్రయాణం కష్టంగా ఉంది. ఇటీవల ఈ మార్గంలో టూ వీలర్‌పై వస్తున్న వ్యక్తి ప్రమాదం బారిన పడి గాయపడ్డాడు. ఇప్పటికైనా అధికారులు రోడ్డును బాగు చేయాలి. – మేకల యాదయ్య, బీజేపీ జిల్లా కార్యదర్శి

## 2.36 కిలోల గంజాయి పట్టివేత

**సాక్షి, సిటీబ్యూరో:** ధూల్‌పేట్ పురానాపూల్, ఆసిఫ్‌నగర్‌లలో రెండు చోట్ల జరిపిన దాడుల్లో ఎక్సైజ్ పోలీసులు 2.36 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పురానాపూల్‌లోని ఒక ఇంట్లో గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు లభించిన సమాచారం మేరకు ఎస్టీఎఫ్ ఏ టీం పోలీసులు దాడి చేసి 1.206 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఈ కేసులో చంద్రముఖి, ఆకాష్ సింగులను అరెస్ట్ చేసినట్లు ఎస్టీఎఫ్ టీం లీడర్ అంజిరెడ్డి తెలిపారు. అలాగే ఆసిఫ్ నగర్ బాలాజీ బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న మహమ్మద్ అఫ్జల్ అమిత్‌ను ఎస్టీఎఫ్ డీ టీం ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి వద్ద 1.16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని స్థానిక ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించారు.

## ఆర్టీఏ పౌరసేవలకు సాంకేతిక చిక్కులు

- ఓటీపీలు అందక పడిగాపులు
- తరచూ తలెత్తే సమస్యలతో తీవ్ర జాప్యం

**సాక్షి, సిటీబ్యూరో:** ఆర్టీఏ పౌరసేవలు సాంకేతిక చిక్కుల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. సకాలంలో ఓటీపీలు లభించక వాహనదారులు పడిగాపులు కాస్తున్నారు. రవాణా శాఖ అందజేసే అన్ని రకాల పౌర సేవలను ఆన్‌లైన్ పరిధిలోకి తెచ్చారు. వాటిలో కొన్నింటిని నేరుగా మొబైల్ ఫోన్ నుంచే పొందే సదుపాయం ఉంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'టీ-ఫోలియో' మొబైల్ యాప్ ద్వారా ఈ సేవలను పొందవచ్చు. కానీ.. సాంకేతిక సమస్యలతో వాహనదారులకు ప్రత్యక్ష సేవలు లభించడం లేదు.

**టీ-ఫోలియో ద్వారా 17 సేవలు..**

డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్‌లు, బదిలీలు, ఫీజులు, పన్ను చెల్లింపులు, పర్మిట్‌లు, పర్మిట్‌ల పునరుద్ధరణ వంటి సుమారు 56 రకాల పౌర సేవలను రవాణాశాఖ 2016లో ఆధునికీకరించింది. పౌరసేవలు పొందేందుకు వాహన వినియోగదారులు మొదట ఆన్‌లైన్‌లో స్లాట్ నమోదు చేసుకొని, ఫీజు చెల్లించి ఆ తర్వాత కేటాయించిన సమయానికి ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లి అధికారులను సంప్రదించాలి. రవాణా కార్యకలాపాలను సరళతరం చేయడంతో పాటు పారదర్శకతను పెంచేందుకు ఈ సదుపాయాన్ని ప్రవేశపెట్టారు. అంతే కాకుండా.. ఆ తర్వాత మరో అడుగు ముందుకేసి వీటిలో 17 రకాల పౌరసేవల కోసం వాహనదారులు ఆర్టీఏకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మరింత సులభం చేశారు. ఇంట్లో కూర్చొని నేరుగా మొబైల్ ఫోన్ నుంచే వాటిని పొందేసదుపాయం అందుబాటులో ఉంది.

- లెర్నింగ్ లైసెన్సుల కాల పరిమితి పొడిగింపు, డ్రైవింగ్ లైసెన్సుల పునరుద్ధరణ, వాహన రిజిస్ట్రేషన్‌ల పునరుద్ధరణ, డూప్లికేట్ డాక్యుమెంట్‌లను తీసుకోవడం, వాహనాలు, లైసెన్సుల చిరునామా బదిలీలు, నిరభ్యంతర పత్రాలు (ఎన్‌ఓసీలు) వంటి 17 రకాల సేవలను మొబైల్ ఫోన్ నుంచే పొందే సదుపాయం ఉంది. మొదట్లో విజయవంతంగా అమలయ్యాయి. ఆర్టీఏ ఆఫీస్‌కు నేరుగా రాలేనివాళ్లు ఈ సేవలను సద్వినియోగం చేసుకున్నారు. కానీ.. గత ప్రభుత్వం అన్ని రకాల పౌరసేవల కోసం ప్రవేశపెట్టిన 'టి-ఫోలియో' మొబైల్ యాప్‌తో ఈ 17 సేవలను అనసంధానం చేసిన తర్వాతే ఆటంకాలు మొదలయ్యాయి.

**జాడ లేని ఓటీపీలు..**

సాధారణంగా పౌరసేవను ఎంపిక చేసుకున్న వెంటనే వాహనదారుడి మొబైల్ ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీ నంబర్‌ను నమోదు చేసిన తర్వాత మాత్రమే ముందుకెళ్లేందుకు అవకాశం ఉంటుంది. కానీ తరచుగా సకాలంలో ఓటీపీలు లభించకపోవడంతో వినియోగదారులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. కొన్నిసార్లు ఫీజులు చెల్లించిన తర్వాత కూడా నిర్ధారణ కావడం లేదు. మరోవైపు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత సంబంధిత డాక్యుమెంట్‌లు డౌన్‌లోడ్ కాకపోవడం మరో సమస్య. 'డ్రైవింగ్ లైసెన్సుల రెన్యువల్స్‌లో తరచుగా ఇలాంటి సమస్యలు వస్తున్నాయి. మొదట్లో ఓటీపీల వద్దనే ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఒక వేళ ఆ దశను దాటుకొని ముందుకు వెళ్లి అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేసి, ఫీజులు చెల్లించిన తర్వాత రెన్యువల్ డాక్యుమెంట్‌లు లభించడం లేదు' అని బంజారాహిల్స్‌కు చెందిన శ్రీకాంత్ తెలిపారు.

- లెర్నింగ్ లైసెన్సుల కోసం ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లి పరీక్షలకు హాజరు కావాలి. ఆరు నెలల్లోపు డ్రైవింగ్ పరీక్షలకు వెళ్లాలి. ఆ కాలపరిమితిలో వెళ్లలేని వాళ్లు గడువు పొడిగించుకోవచ్చు. మొదట ఒకే వాహనం నడిపేందుకు ఆసక్తి చూపిన వాళ్లు మరో కేటగిరీ వాహనాన్ని కూడా ఆన్‌లైన్‌లో జత చేసుకోవచ్చు. కానీ ఇలాంటి సేవలు కూడా సాంకేతిక ఇబ్బందులతో సకాలంలో లభించడం లేదని వినియోగదారులు చెబుతున్నారు. మరోవైపు టీ-ఫోలియో యాప్‌ను ఈ సేవ కేంద్రాలు నిర్వహించడం వల్లే సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. త్వరలోనే సాంకేతిక వైఫల్యాలను అధిగమించనున్నట్లు చెప్పారు.

### చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి మృతి

**యాచారం:** తీవ్ర మనస్తాపంతో చెట్టుకు ఉరివేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి గ్రామానికి చెందిన మొరుగు యాదయ్య(45) గ్రామంలో వ్యవసాయ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గ్రామంలో శనివారం సాయంత్రం కొందరితో స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో తీవ్ర మనస్తాపం చెంది అదేరోజు రాత్రి గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ పొలంలోని చెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు తెలిపారు.

### ఆరో అంతస్తు పైనుంచి పడి కార్మికుడి మృతి



బికాశ్ కుమార్ మృతదేహం

**శంకర్‌పల్లి:** ఆరో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కార్మికుడు కింద పడి మృతి చెందిన సంఘటన మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వీరబాబు కథనం ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన బికాశ్ కుమార్ (24) కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చి వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మండల పరిధిలో ఇక్ఫాయ్ కళాశాలలో ఆర్ఓ వాటర్ ప్లాంట్ పని నిమిత్తం ఐదు రోజుల నుంచి వెల్డింగ్ పనులు చేస్తున్నాడు. ఆరో అంతస్తులో పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి పోయాడు. వెంటనే స్థానికులు శంకర్‌పల్లిలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం పోయింది

- పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజలే బుద్ధి చెబుతారు
- రంగారెడ్డి జిల్లాలో రెండు స్థానాలకు ఉపఎన్నికలు ఖాయం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**మొయినాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయింది.. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజలే బుద్ధి చెబుతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని పెద్దమంగళారం మాజీ సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు కోట్ల నరోత్తంరెడ్డి, వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు ఆదివారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో కేటీఆర్‌ని కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. కేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి స్వాగతించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చేవెళ్ల, రాజేంద్రనగర్ స్థానాల్లో త్వరలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని అన్నారు. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందని.. ప్రజలు బీఆర్ఎస్‌నే కోరుకుంటున్నారన్నారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు సముచిత స్థానం కలిప్తామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, కొత్త నర్సింహారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు మాణిక్‌రెడ్డి, శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు శ్రీహరియాదవ్, సుధాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పాత కక్షలతో యువకుడి దారుణ హత్య



మనోజ్ (ఫైల్)

**చైతన్యపురి:** పాత కక్షలతో ఓ యువకుడిని కత్తితో పొడిచి దారుణంగా చంపేసిన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు.. ఓల్డ్ నాగోల్ విలేజ్‌కు చెందిన వంగ మనోజ్ (21) శనివారం అర్ధరాత్రి సమయంలో స్నేహితుడు బండెల వంశీతో కలిసి నాగోల్ ఫ్లైఓవర్ సమీపంలోని ఓ రెస్టారెంట్ ముందు బైక్‌పై కూర్చుని టిఫిన్ చేస్తున్నాడు. అదే సమయంలో నాగోలు జైపురి కాలనీకి చెందిన సంజయ్ ముగ్గురు స్నేహితులతో కలిసి బైక్‌పై వచ్చి మనోజ్ మెడను గట్టిగా పట్టుకుని వెంట తెచ్చుకున్న కత్తితో కడుపులో పొడిచాడు. కింద పడిపోయిన మనోజ్‌ను మరో వ్యక్తి పట్టుకోగా పైన కూర్చుని చాకుతో గొంతుకోశాడు. అతని స్నేహితుడు వంశీ అడ్డుకోవటానికి ప్రయత్నించగా అతనిపైనా కత్తితో దాడి చేయటంతో గాయాలయ్యాయి. మనోజ్ రక్తపు మడుగులో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

**రాజీ కుదుర్చుకున్నా..**

మనోజ్, సంజయ్‌లు గతంలో స్నేహితులు. ఈ నేపథ్యంలోనే పోయిన ఏడాది ఏప్రిల్ నెలలో వీరి మధ్య గొడవ జరిగింది. సంజయ్‌పై కత్తితో దాడి చేయగా అప్పట్లో మనోజ్‌పై ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అనంతరం కొన్ని రోజుల తర్వాత పెద్దల సమక్షంలో ఇద్దరి మధ్య రాజీ కుదిరింది. అయినా సంజయ్ పథకం ప్రకారం వెంట తెచ్చుకున్న మనోజ్‌ను హతమార్చినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మృతుడి సోదరుడు మధు పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

# విద్యతోనే మార్పు సాధ్యం

### ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

**మంచాల:** విద్యతోనే మార్పు సాధ్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర విద్య శాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. ఆరుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధిలో పిల్లల తల్లిదండ్రుల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పిల్లలను బడికి పంపించి చేతులు దులుపుకోకుండా పాఠశాలలో ఎలాంటి సదుపాయాలు ఉన్నాయి, ఏ రకంగా తమ పిల్లలకు విద్యను అందిస్తున్నారు తదితర విషయాలు గమనించాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలన్నారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రాందాస్, ప్రధానోపాధ్యాయుడు గిరధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల తాకిడి

### రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్



**అత్తాపూర్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు విద్యాశాఖ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు రాజేంద్రనగర్ మండల విద్యాధికారి కె.శంకర్‌రాథోడ్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల పనితీరు విశాలమైన తరగతి గదులు, ఒక్క రూపాయి ఖర్చు లేకుండా చదువుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ... ఎలాంటి సదుపాయాలు లేకుండా ఇరుకు గదుల్లో డిగ్రీలు లేని శిక్షణ లేని ఉపాధ్యాయుల చేత విద్యార్థులను రుద్దడం మాత్రమే చేస్తారని అన్నారు. హంగు.. ఆర్భాటాలతో విద్యార్థులు.. విద్యార్థుల తల్లిదండ్రులను భ్రమలో పడేస్తూ పాఠశాల నుంచి అడ్మిషన్లు ఇవ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. మధ్య తరగతి కుటుంబాల పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు స్థానిక యువకులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ప్రజాప్రతినిధులు సహకారం అందించాలని ఎంఈఓ కోరారు. రాజేంద్రనగర్ మండల పరిధిలోని శివరాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మంచి రికార్డులు ఉన్నాయని అన్నారు. దివంగత మాజీ హోంమంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డిలు ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రంగారెడ్డి జిల్లా శివరాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య రెండు వేలకు పైచిలుకు ఉందని అంతేస్థాయిలో ఉపాధ్యాయులు ఈ పాఠశాలకు సొంతమని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పూర్తి స్వేచ్ఛ ఉంటుందని ప్రతి విద్యార్థి ఎంతో ధైర్యంగా స్వేచ్ఛగా తన మనోభావాలను కుటుంబ నేపథ్యం తదితర అంశాలను వివిధ సభల్లో చెప్తారన్నారు. ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు పాఠశాలల పేర్లతో ముందు వెనుక తోకలు తగిలిస్తూ విద్యార్థి లోకాన్ని ప్రలోభాలకు గురి చేస్తున్నారన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోనే ఉన్న ఎలాంటి పర్మిషన్ లేకుండా నడిపిస్తున్న కొన్ని ప్రైవేటు పాఠశాలలకు ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. విద్యా శాఖ అనుమతి లేకుండా ఎలా పాఠశాల బోర్డులను ఏర్పాటు చేసుకుంటారని అలాంటి వాటిని వెంటనే తొలగించాలని ఆయన సూచించారు.

## మద్యం మత్తులో కిందపడి వ్యక్తి మృతి

**మైలార్‌దేవ్‌పల్లి:** మద్యం మత్తులో గ్రానైట్ గడపపై పడి ఓ వ్యక్తి మరణించిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్ఐ సత్యకుమార్ సమాచారం మేరకు... రాజస్తాన్‌కు చెందిన మనోజ్ (47) భార్య, పిల్లలతో కలిసి నగరానికి వచ్చి మైలార్‌దేవ్‌పల్లి వినాయక్‌నగర్ ప్రాంతంలో ఓ ఇంట్లో నివాసం ఉంటున్నాడు. వేసవి సెలవులు కావడంతో అతడి భార్య, పిల్లలు రాజస్తాన్ వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లోంచి దుర్వాసన రావడంతో ఇంటి యజమాని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తలుపులు పగులగొట్టి చూడగా మనోజ్ మద్యం మత్తులో బెడ్రూంలో బాత్రూం గ్రానైట్ గడపపై పడి తలకు రక్తగాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కోణార్క్ రైలుకు ఎదురెళ్లి..

**నాంపల్లి:** జీవితంపై విరక్తి చెందిన ఓ గుర్తు తెలియని యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన బోరబండ-హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ల మధ్యలో ఆదివారం చోటుచేసుకుంది. నాంపల్లి జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సుమారు 35 సంవత్సరాల వయసు కలిగిన ఓ గుర్తుతెలియని యువకుడు బోరబండ-హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్ల మధ్యలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో అతడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఒంటిపై బూడిద రంగు టీ షర్టు, నీలం రంగు జీన్స్ ప్యాంటు ధరించినట్లు పోలీసులు తెలిపారు. సంబంధీకులెవరైనా ఉంటే నాంపల్లి జీఆర్పీ పోలీసులను లేదా 9848349544, 040-23202238 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# కోల్‌కతా కాప్స్ వర్సెస్ హైదరాబాద్ పోలీస్




### రూ.75 లక్షలు మోసం కేసులో నిందితుడిగా జస్బిందర్

- అక్కడకు వెళ్లి అరెస్టు చేసిన గోల్కొండ పోలీసులు
- దీనిపై షేక్‌స్పియర్ సరానీ ఠాణాలో కిడ్నాప్ కేసు నమోదు
- తమకు ముందస్తు సమాచారం లేదంటున్న ఆ అధికారులు
- సమాచారం ఇస్తే ఫలితాలు తారుమారని చెప్తున్న సిటీ కాప్స్



జస్బిందర్ సింగ్



**సాక్షి, సిటీబ్యూరో/గోల్కొండ:** ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్-సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య పోరు మాట అటుంచితే...ప్రస్తుతం ఓ మోసగాడి అరెస్టు విషయంలో కోల్‌కతా కాప్స్ వర్సస్ హైదరాబాద్ పోలీసు అనే పరిస్థితి వచ్చింది. గోల్కొండ పోలీసు స్టేషన్‌లో నమోదైన మోసం కేసులో నిందితుడు జస్బిందర్ సింగ్‌ను నగర పోలీసులు గురువారం కోల్‌కతాలో అరెస్టు చేసి తీసుకువచ్చారు. ఇది కిడ్నాప్ అంటూ అతడి స్నేహితుడు ఇచ్చిన సమాచారంతో అక్కడి షేక్‌స్పియర్ సరానీ ఠాణాలో కిడ్నాప్ కేసు నమోదైంది. ఈ నిందితుడి అరెస్టుపై తమకు ముందస్తు, తదనంతర సమాచారం లేదని కోల్‌కతా అధికారులు చెప్తుండగా..అలా సమాచారం ఇస్తే ఫలితాలు తారుమారు అవుతున్నాయని నగర పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

**నగర వ్యాపారిని మోసం చేసిన కేసు...**

నగరంలోని సౌత్ వెస్ట్ జోన్ పరిధిలో ఉన్న గోల్కొండకు చెందిన సాజిద్ అహ్మద్ ఖాన్ అల్కాపూర్‌లో దుకాణం నిర్వహిస్తున్నారు. కొన్నాళ్ల క్రితం ఇరువురు తన స్నేహితుడి ద్వారా ఖాన్‌ను పరిచయం అయ్యారు. ఈయన వ్యాపారాల లావాదేవీలు, విస్తరణపై ఉన్న ఆసక్తిని తెలుసుకున్నారు. ఫుడ్ ప్రాడక్టస్ వ్యాపారంలో ఉన్న హల్దీరామ్స్ సంస్థ డీలర్‌షిప్ ఇప్పిస్తామంటూ ఖాన్‌ను నమ్మించారు. ఈ ప్రక్రియ పూర్తి చేసే దళారి అంటూ కోల్‌కతాకు చెందిన జస్బిందర్ సింగ్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. సింగ్ చెప్పినట్లే ఆయన కంపెనీకి చెందిన ఖాతాలోకి ఖాన్ ఈ నెల 9న రూ.75 లక్షలు బదిలీ చేశారు. ఆపై సింగ్‌తో సహా అందిరి ఫోన్లు స్విచ్ఛాఫ్ కావడంతో తాను మోసపోయినట్లు ఖాన్ గ్రహించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గోల్కొండ పోలీసులు ఈ నెల 13న కేసు నమోదు చేసుకున్నారు. ఇందులో జస్బిందర్ సహా నలుగురిని నిందితులుగా చేర్చారు.

**వారికి చెప్తే వీళ్లు చెక్కేస్తున్నారు**

ఇతర రాష్ట్రాల్లో నిందితుల అరెస్టు అనేది సర్వసాధారణమే. ప్రధానంగా చీటింగ్ కేసులతో పాటు సైబర్ నేరాల్లో నిందితులుగా ఉన్న వారి కోసం గాలిస్తూ పోలీసులు వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. ఉన్నతాధికారుల నుంచి లిఖిత పూర్వక అనుమతి తర్వాతే ఇలా వెళ్తారు. గతంలో ఇలా వెళ్లిన బృందాలు కచ్చితంగా అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చి, వారితో కలిసి నిందితుల వద్దకు వెళ్లేవి. అయితే కొన్నాళ్లు ఇలా సమాచారం ఇచ్చిన వెంటనే ఆ విషయం నిందితులకు తెలిసిపోతోంది. ఆ వెంటనే అజ్ఞాతంలోకి వెళ్లిపోతున్న కేటుగాళ్లు నగర పోలీసులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. దీంతో తమ పంథా మార్చిన నగర పోలీసులు రహస్యంగా వెళ్లి నిందితుల్ని పట్టుకుంటున్నారు. ఇలా అరెస్టు చేసినప్పుడు పరిస్థితుల్ని బట్టి అక్కడి కోర్టులో హాజరుపరిచి పీటీ వారెంట్‌పై తీసుకురావడమో... నేరుగా తీసుకువచ్చి ఇక్కడి కోర్టులో హాజరుపరచడమో చేస్తున్నారు. జస్బిందర్ సింగ్ అరెస్టు విషయంలోనూ తాము నిబంధనలు పాటించామని, కోల్‌కతా పోలీసుల కేసును చట్ట పరంగా ఎదుర్కొంటామని సిటీ అధికారులు చెప్తున్నారు.

#### అరెస్టు విషయంలో వివాదం

ఈ కేసు దర్యాప్తులో భాగంగా గోల్కొండ పోలీసులు నిందితుల ఆచూకీ ఆరా తీశారు. సాంకేతిక ఆధారాలను బట్టి హౌరాకు చెందిన సింగ్ కోల్‌కతాలోని కామిక్ స్ట్రీట్‌లో ఉన్న ఓ లాడ్జిలో ఉన్నట్లు గుర్తించారు. నగరం నుంచి వెళ్లిన ప్రత్యేక బృందం గురువారం ఉదయం ఆ హోటల్‌లోని రూమ్ నెం.418లో ఉన్న సింగ్‌ను అరెస్టు చేసి తీసుకువచ్చారు. దీనిపై సింగ్ స్నేహితుడు, జార్ఖండ్‌కు చెందిన అజిత్ కుమార్ దాస్ సమాచారంతో షేక్‌స్పియర్ సరానీ పోలీసులు 'హైదరాబాద్ పోలీసులుగా చెప్పుకున్న వ్యక్తుల'పై కిడ్నాప్ కేసు నమోదు చేశారు. ఈ అరెస్టుపై తమకు ముందస్తు, తదనంతర సమాచారం లేదని ఆ పోలీసులు చెప్తున్నారు. హోటల్ నిర్వాహకుడు చెప్పిన వివరాల ప్రకారం ఆ వ్యక్తులు గోల్కొండ పోలీసులుగా భావిస్తూ షేక్‌స్పియర్ సరానీ అధికారులు ఈ-మెయిల్ ద్వారా సమాచారం అడిగారు. దీంతో తామే చీటింగ్ కేసులో సింగ్‌ను అరెస్టు చేసినట్లు నగర అధికారులు జవాబు ఇచ్చారు. ఎలాంటి సమాచారం లేకుండా ఇలా అరెస్టు చేయడం చట్ట వ్యతిరేకం అని కోల్‌కతా పోలీసులు ఆరోపిస్తున్నారు.